
# కురిసే మేఘం

శ్యామ



'నేను ఇలా నడుస్తాననుకొన్నావు కదూ?'

టేబుల్ మీద రెండు వేళ్ళతో పీత నడకను ఇమిటేట్ చేస్తూ చూపించిందామె. నేరేడి పండు రంగులో మిలమిల మెరుస్తున్న ఆమె పెదవులనీ, అదే రంగు నెయిల్ పాలిష్ వేసిన గోళ్ళనూ మార్చి మార్చి చూస్తూ మాట్లాడలేదతను.

'ఊ...చెప్పు...'కిలకిలమని నవ్విందామె.

తెల్లని మొకం మీదికి సముద్రపు అల వంటి జుత్తు జారిపడింది. తలని వంచి జుట్టును పైకి ఎగరేసింది ఆమె...

రెప్పలమీది పూతనూ...పైన అద్దిన మెరిసే చమ్కీనీ, విసన కర్రలా కళ్ళు వాల్చి తలెత్తకుండానే కళ్ళెత్తి తనను చూసిన ఆమె చూపుకు వద్దన్నా అతని ఆలోచన దాసోహం అంటోంది.

'చెప్పు మాన్...మాట్లాడవేం'

ఆమె ముందున్న గుండ్రని గ్లాసులోని రమ్‌ని సిప్ చేసిందామె. అతని ముందున్న లెమన్ వంటి డ్రింక్ అలానే వుంది.

'తీసుకోబ్బా...అదేం చేయదు..అదుట్టి లేడీస్ డ్రింక్..' తెరతెరలుగా నవ్వుతుందామె. అతను పెదవులు తడుపుకుంటూ చుట్టూ చూశాడు. టేబుల్స్ అన్నీ ఫుల్. మందు గ్లాసుల సవ్వడి..మందెక్కువైన సందడి...అసలా వాతావరణంలోనే ఏదో నిషా..

తల తిప్పి ఆమె వంక చూశాడు. బరువెక్కిన కళ్ళతో అతని వైపే చూస్తోందామె.

'కీర్తీ...' అతను ఆమె చేయి పట్టుకున్నాడు.

ఒక్క నిముషంపాటు తన చేతి మీద ఉన్న అతని అందమైన తెల్లని చేతి వంక చూసిందామె. మధ్య వేలికి మిల మిల మెరిసే కెంపు ఉంగరం. సన్నని పొడుగాటి అత్యంత అందమైన వేళ్ళు...కవిత్వాన్ని అలవోకగా అలా రాసేవేళ్ళు...అసలా వేళ్ళ కొసల్లోంచే ప్రేమ, ఇష్టం ప్రపంచం పట్ల మమకారం...ఇన్ని ఉత్తమ గుణాలు పుట్టుకొస్తాయోమో! చిట్ట చివరికి కాస్తంత వణుకుతూ తన చేతిమీదకి అలా జారిన ఆ వేళ్ళ వంక చూస్తూ కిలకిలమని నవ్విందామె. కలహంసలు ఉంటే ఉలిక్కిపడేవేమో! జలతరంగిణి కాస్త అసూయ పడిందేమో. కెంపు ఉంగరాన్ని పదే పదే ముట్టుకుంటూ టెన్షన్ తగ్గించుకొనేందుకు ప్రయత్నిస్తూ అతను! ఆమె ఆలోచనగా వెనక్కు వాలింది. 'ఆశ్చర్యంగా ఉంది... ఏమిటి వీళ్ళంతా...స్నేహానికి అర్థం ఇదొక్కటేనా! ఆమె ముందు ఎప్పటి పాత ప్రశ్నే!

* * *

'ఈ వారం కాలం చూశారా...'

అన్నది సౌజన్య...

టేబుల్ మీద వేళ్ళతో దరువు వేస్తూ అద్దంలోంచి ఆ హోటల్‌కి అలవాటుగా వచ్చే మిత్రుల కోసం ఎదురు చూస్తూ ఉన్న అశోక్ తల తిప్పి చూశాడు.

'కీర్తిగారిదేనా...అబ్బో...'

పెదవులు బిగించి, కళ్ళు మూసి, తల వూపి తన తన్మయత్వం ప్రకటించాడు అశోక్. వళ్ళు మండిపోయింది సౌజన్యకి.

"యాక్షన్ సరేగానీ...విషయంలోకి రా...పేజీలు నువ్వే కదా పెట్టించావు"

రెట్టించింది ఆమె.

ఈ నిముషం దాకా నేను ఉద్యోగంలోనే ఉన్నాను. నిన్ననే సాహితీ పేజీ స్వయంగా పేజ్ మేకప్ చేశాను. నీకు డౌటు రానేలా...? తమాషా చేస్తున్నట్లు తల వూపుతూ అడిగాడతను. సౌజన్యకి చిరాకొచ్చింది. నేను సీరియస్‌గా అడుగుతుంటే నీవు కన్నింగ్‌గా మాట్లాడుతున్నావు! అన్నది కోపంగా.

అశోక్ ఆశ్చర్యంగా చూశాడు. ఇందులో నా కన్నింగ్‌నెస్ ఏవుందీ? ఇవ్వాళ తమకి మూడ్ బాగా లేనట్లుంది. ఆఫీస్‌లో ఏదైనా గొడవైందా?

సౌజన్య మొకం కోపంతో ఎరుపెక్కింది.

'చూడు అశోక్...ఇంక నటించనవసరం లేదు నువ్వు. ఫర్ యువర్ ఇన్‌ఫర్‌మేషన్ ఇవ్వాళ నాకు వీక్లీ ఆఫ్. సరాసరి కొంపలోంచి ఇలా దిగబడ్డాను. ఎగతాళి కట్టిపెట్టి విషయం చెప్పు. ఈ వారం ఆర్టికల్ కీర్తినే రాసిందంటావా... ఆవిడ రైటింగ్ నీకు బాగానే తెలుసుగా...కంపోజ్ అవుతుంటే నేను చూశాను.

అశోక్ ఆమె వంక చిత్రంగా చూచేడు.

"నువ్వేం మాట్లడుతున్నావో నాకు అర్థం కాలేదు"

"వద్దు...వద్దు...ఇంక చాలు...నీకు బాగానే అర్థం అయింది. అసలు కీర్తి అంటే మీకందరికీ గ్లామర్. అందుకే అది ఆడే ఆటలన్నీ చెల్లుతున్నాయ్..."

అసహ్యంతో మొకం తిప్పుకొంది సౌజన్య.

'మీరు ఎలా అపార్థం చేసుకున్నారో నాకు తెలియదు. మనం ఓ కమర్షియల్ పేపర్ ఆఫీస్‌లో పనిచేస్తున్నాం. మనం చేసే జర్నలిస్టు ఉద్యోగాలకు ఒక గౌరవం



ఉంది. ఆవిడ ఆర్టికల్ ఆవిడే రాశారు. ఇంకా చెప్పాలంటే మన ఆఫీస్‌లోనే కూర్చుని రాశారు. మీకు ఇలాటి డౌట్‌లు ఎందుకు వస్తున్నాయో తెలియదు" అశోక్ మొహం చిట్లించుకున్నాడు.

సౌజన్య సర్దుకుంది.

'అదేం లేదు...ఈ రోజు కీర్తి రాసిన కాలమ్, ఎంతో ప్రోగ్రెసివ్‌గా ఉంది. గతంలో అలాటి ఆర్టికల్ ఆమె ఎప్పుడూ రాయనే లేదు. ఆ రాసే మేనరిజం అచ్చం నువ్వు...నువ్వు రాసినట్టే వుంది!

అశోక్ నిఠారుగా కూర్చున్నాడు. కోపం ఆపుకునేందుకు ఒక నిముషం కళ్ళు మూసుకున్నాడు. తలవంచుకొని చేతుల వంక చూసుకున్నాడు. కెంపు వుంగరాన్ని రెండు సార్లు వేలినుంచి తీసి మళ్ళీ తగిలించుకున్నాడు.

సౌజన్య మనం ఫ్రెండ్స్‌మి...ఇంకెప్పుడూ ఇలాటి విషయాలు మాట్లాడకండి...స్నేహానికి కూడా లిమిట్స్ వుంటాయి. మనం మన హద్దుల్లో వుంటే బావుంటుంది.

సౌజన్య అతన్ని వారిస్తూ, నొరెత్తే లోగానే మీనన్ వచ్చేశాడు. వస్తూనే పుస్తకాల కట్ట టేబుల్ మీద పెట్టేసి

'ఇవిగోరా అశోక్. ఈ వారం రివ్యూకి బుక్స్...ఇందాకా కాచిగూడా వెళితే కొత్త బుక్స్ వచ్చాయని ఇద్దరు పబ్లిషర్స్ ఇచ్చారు. మా బుక్స్ మా ఆఫీస్‌లో పారేసి, నీవి ఇలా పట్టుకొచ్చేశాను" అన్నాడు కుర్చీ లాక్కుని కూర్చుంటూ...కళ్ళెగరేసి ఎలా వున్నావంటూ సైగలతోనే సౌజన్యని పలకరించాడు. సౌజన్య బలవంతంగా నవ్వేసింది. ఆమె దృష్టంతా పుస్తకాల బండిల్ వైపు తిప్పి చూస్తున్నా అశోక్ వైపే ఉంది..'

'ఇతన్ని అనవసరంగా నొప్పించాను...' పదే పదే మనసులో అనుకొంటోంది ఆమె.

శర్మగారొచ్చారు అంటూ లేచాడు మీనన్. శర్మగారు కుర్చీ జరుపుకొని సౌజన్య పక్కన కూర్చున్నాడు. తెల్లని ముఖానికి రంగేసిన నల్లని జుత్తు ఏదో కొత్త టోపీ పెట్టినట్లు గమ్మత్తుగా ఉంది. ముందుకొచ్చిన బొర్రని దాచేస్తూ లూజ్ బనియన్‌లో టక్ చేశాడు శర్మ. వయసుని ఎక్కడో 40ల దగ్గరే ఫ్రీజ్ చేసే యత్నం.

"ఎంత షోకు చేసుకున్నా ముసలాడి లాగే ఉన్నాడు" అనుకొంది సౌజన్య. నవ్వొచ్చింది కూడా.

ఏవోయ్ 'ఒక వేణువు' బాగా వచ్చిందిగా. మంచి పేజ్ మేకప్ చేశావూ... అన్నాడు శర్మ చేతిలో మడిచి పట్టుకొచ్చిన పేజీ టేబుల్ మీద పరిచి. స్పెషల్ పేజీలో పైన 'ఒక వేణువు' టైటిల్ కింద అందమైన కీర్తి మొహం సమ్మోహనకరంగా వుంది. అప్రయత్నంగా ముందుకు వంగి నలిగిన పేజీ సరిచేసి కీర్తి వైపు చూసింది సౌజన్య.

'గొప్పగా వుంది' అన్నారు శర్మ.

'ఏవిటీ గొప్పగా వుండిందీ. ఫోటోనా ఆర్టికలా...' కీర్తి ఫోటో మీదికి వాలిపోయి చూస్తున్న మీనన్.

'సౌజన్యగారికి కోపం రాకపోతే, ఫోటో చూశాక ఐటమ్ చదవటం దండగ... శర్మగారు నవ్వేడు.

సౌజన్యకి చురుక్కుమంది. కోపంగా శర్మగారి వైపు చూసింది.

మీరు ఐటమ్ ఫొలో అవ్వరమేమోగానీ, మిగతావాళ్ళు ఆమె రాసింది చూసేనండీ ఆవిడ ఫాన్స్ అయిందీ...' అన్నది.

'ఆఫ్‌కోర్స్ నేనూ ఆవిడ ఫేన్‌నేనండీ... అర్థవంతంగా తలవంచి నవ్వుతూ మిగతా వాళ్ళవంక చూశారు శర్మగారు.

ఆ పెద్ద మనిషి వెకిలితనానికి వళ్ళు మండింది సౌజన్యకి. అశోక్ వైపు చూసింది. అతని మొహం ఎర్రగా కంది పోయి వుంది.

"ఆ మాటకొస్తే అశోక్ మాత్రం ఆవిడ ఫాన్ కాదా...ఆవిడ ఆర్టికల్ ఆఫ్ పేజీ పైనే వచ్చింది" చేతితో కొలిచి ఎంత సైజులో వచ్చిందో చూపిస్తున్నాడు శర్మ.

అంతే, లేని అసహ్యంతో లేచి నిలబడింది సౌజన్య. "గతంలో మీ అందరి ఆర్టికల్స్ పేజీలకు పేజీలు వేసి ఎన్నోసార్లు తిట్లు తిన్నాడు అశోక్. మా ఎడిటర్ ఒక సారి స్టాఫ్ ముందే చివాట్లు పెట్టి డైలీ పేపర్ సాహిత్యం స్పెషల్ చేస్తున్నావని ఒక రకంగా మెమో ఇచ్చినంత పని చేశాడు. అశోక్‌కి రచనల మీద అభిమానమండి శర్మగారు. అతను అక్షరాల్ని ప్రేమించే మనిషి...అంతేగానీ..." కోపం ఆపుకునేందుకు ఓ నిముషం నిలబడింది సౌజన్య. అశోక్ సౌజన్య వైపు అభిమానంగా చూశాడు. నవ్వుతూ శర్మగారి వైపు చూసి

"మీరు ఎన్నయినా మాట్లాడండి. మా సౌజన్య ఆడవాళ్ళ జోలికి ఎవరు వెళ్ళినా చంపేస్తుంది" అన్నాడు.

శర్మగారి మొకం అప్పటికే మాడిపోయింది. తప్పనిసరిగా బలవంతంగా నవ్వేస్తూ

'కీర్తి తనకు ఒక్కదానికే ఫ్రెండ్ కాదు. మనకూ స్నేహితురాలే' అన్నాడు.

"అందుకే కాబోలు ఆవిడ అందంతో ఆర్టికల్ సరితూగలేదని సెలవిచ్చాడు" వ్యంగ్యంగా అంది సౌజన్య.

'ఇదిగో తెల్ల జండా వూపుతున్నా. చర్చ కట్టిపెట్టండి. కీర్తి మనందరికీ దోస్త్. ఆవిడ లేకుండా ఆమె గురించిన చర్చలొద్దు" మీనన్ తెల్ల హాండ్‌కర్చీఫ్ వూపుతూ సంధి ప్రయత్నాలు చేశాడు.

పెదవులు కొరుక్కుంటూ కూర్చుంది సౌజన్య. మూడ్ ఆఫ్ అయింది. లోలోపల గిల్టీగా ఉంది. తనలోనే తను రెండుగా విడి పోయింది. ఒక సౌజన్య కీర్తిని ద్వేషిస్తోంది. ఇంకో సౌజన్య స్త్రీగా వున్న కీర్తిని ప్రేమిస్తోంది. తనేం చేయాలి నిజంగా! కాఫీలు వస్తున్నాయి. ఇంకా ఇంకా ఆఫీసులనుంచి, ప్రెస్‌లనుంచి కథకులు, కవులు, జర్నలిస్టులు వచ్చి చేరుతున్నారు. హోటల్ మాటల సందడితో కోలాహాలంగా ఉంది. హలోలు, హాయ్‌లు, టీలు, చర్చలు...వీటన్నిటిమధ్యనా సౌజన్య అన్యమనస్కంగానే ఉంది.

'సౌజన్య పద పోదాం ' అన్నాడు అశోక్. ఆలోచిస్తూ కూర్చున్న సౌజన్య లేచి బాగ్ చేతిలోకి తీసుకుంది.

**( మిగతా 29వ పేజీలో )**

(కథ...12 వ పేజీ తరువాయి)

నియాన్ లైట్ల వెలుగు పడుతున్న రోడ్డు మీద, మనుష్యుల మధ్య తాపీగా నడుస్తుంటే మనస్సులో పేరుకొన్న దిగులు కోపం తగ్గుతున్నట్లుగానే ఉంది.

'ఈ మనుష్యుల మధ్య స్నేహస్పర్శ ఎంత అద్భుతంగా ఉంటుందో బాబోయ్. అందరిమధ్య చేతులూపుకుంటూ నడుస్తూ ఉంటే ప్రాణం హాయిగా ఉంది అనుకుంది సౌజన్య.

మౌనంగా నడుస్తున్న అశోక్ హఠాత్తుగా ఆగాడు.

'కీర్తి అంటే నాకు చాలా అభిమానం సౌజన్య. ఐ లైక్ హర్' అన్నాడు.

సౌజన్య ఆశ్చర్యం లేకుండా చూసింది. నాకు తెలుసు అన్నట్లు నవ్వింది.

'అంత మాత్రాన ఆవిడ ఆర్టికల్ నేను ఎలా రాస్తాను. కాకపోతే రాయమని ప్రోత్సహిస్తాను. దగ్గరుండి పేజ్ మేకప్ చేయిస్తాను" అన్నాడు అపాలజెటిక్‌గా మొహంపెట్టి అశోక్.

ఇద్దరూ నడవటం మొదలు పెట్టారు. సౌజన్య మనసు కల్లోలంగా ఉంది.

కీర్తి చాలా స్నేహశీలి. కానీ ఆ తాగుడు, మగపిల్లలతో ఆ స్నేహాలు. ఎడిటర్స్‌తో పూసుకు తిరగటం, ఆవిడ రాసిన ఆర్టికల్స్ ప్రతిపేపర్‌లో టపటపాపడిపోవటం ఎక్కడో కాస్త అసూయ కలిగించింది నిజమే. ఆలోచనలో లోపం ఉంది..."

తలెత్తి అశోక్ వైపు చూసింది సౌజన్య.

'ఎంత తెలివైనవాడు. ఎంతమంచి పొయిట్రీ రాస్తాడు. బిక్షువర్షీయసీ చదువుతూ తొణికిన అతని గొంతు, చెరబండరాజు కవిత చదువుతూ తడిసిన అతని కళ్లు...ఎంత ప్రేమగా చెప్పాయి కీర్తి మీద ఇష్టాన్ని"

" ఇంకో వికెట్ పడింది అని వెక్కిరిస్తూ ...నర్మదకి ఫోన్‌చేసి చెప్పింది తెలుసా కీర్తి...' అంది అలగినట్లు మొహం పెట్టి.

అశోక్ నవ్వాడు.

నాకు ఆమె ఇష్టమని చెప్పాను. ఆమెకు నామీద ఇష్టమో లేదో నేను కనుక్కోలేదు. నా ప్రయారిటీ ఆమె...బహుశ ఆమె ప్రయారిటీ నేను కాకపోవచ్చు కదా...'

'బాగా తాగుతోంది' అన్నది సౌజన్య ఎందుకో కీర్తి మీద కోపం తగ్గిపోయింది.

'అవును ఒక్కళ్ళయినా ఆమెతో ప్రేమగా ఉంటారా? నువ్వు ఆలోచించు. ఈ పదేళ్ళ ఉద్యోగంలో మన పేపర్లో మనం ఎన్నెన్నో ఆర్టికల్స్ వేశాం. ఎన్నో కథలు వేశాం. ఎంతమందిని ప్రమోట్ చేశాం. వీళ్ళంతా ఇవ్వాళ మహాకవులూ, కథకులూ. ఏం పాతనే మనం ఎప్పుడూ నెత్తిన మోయాలా? కొత్తనీరు వస్తుంది, పాత నీరు కొట్టుకుపోతుంది. అది అంతే. ప్రకృతిధర్మం. ఇక్కడా అంతే. సాహిత్యం మటుకు, కొత్త రక్తంతో శక్తిమంతం కాదా. కీర్తి మోడరన్‌గర్ల్. ఫారిన్‌లో చదువుకొంది. ఆమెకు హద్దులు తెలియవు. ఆమెను అందరూ కేవలం ఆడదిగానే చూశారు. ఆమె స్వేచ్ఛను విశృంఖలత్వంగా లెక్క తేల్చారు. ఆమెను పక్కమీదికి పనికివచ్చే మనిషిగా మాత్రమే చూశారు. ఆమె ఎంత డిప్రెషన్‌లో ఉంటుందో తెలుసా...'

కళ్ళజోడు వెనకాల తడిబారిన అతని కళ్ళలోకి చూసింది సౌజన్య.

సాయంత్రం వేడిగా ఉన్న వాతావరణం నెమ్మదిగా చల్లబడుతోంది. గాలి నెమ్మదిగా వేగం పుంజుకొంటోంది. కాయితం ముక్కలా రాలిన ఆకులు, సుడులు తిరుగుతూ రెపరెపలాడుతూ పరుగెత్తిపోతున్నాయి. సౌజన్య మారిపోతున్న వాతావరణం చూస్తూ నెమ్మదిగా అడుగు లేస్తోంది.

మనసులో ఎప్పుడెప్పుడో, ఎక్కడెక్కడో విన్న పలకరింపులు. మనసును కత్తిలా కోసే జ్ఞాపకాలు.

'ఈవినింగ్ మీ ప్రోగ్రామ్ ఏమిటి సౌజన్య"

"సాయంత్రం అలా ప్రెస్‌క్లబ్‌లో కలుస్తున్నాంగా. మీరు రాకపోతే క్లబ్ చిన్నబోతుంది."

"ఏమండోయ్ రేపే ఆదివారం బోయనానికి ఏం పెడుతున్నారు స్పెషల్స్...'

"ఈ తెల్లని చీరెలో వరదగోదావరిలా వున్నావు సౌజన్య.."

"తాజ్‌లో కప్పు టీ తాగించండి. మేం ధన్యులమౌతాం.."

ఈ ఆహ్వానాలన్నింటి వెనకా ఎంత వెకిలితనం. ఏ కోపం, ఏ అసహ్యం తనకు పెళ్లి మీద మనసు లేకుండా చేసిందో?, యూనివర్శిటీ చదువు, గోల్డ్‌మెడల్స్, జర్నలిస్ట్ ఉద్యోగం తను పూర్తిగా నిలబడేందుకు చేసిన మానవాతీతప్రయత్నాలు....కేవలం ఆడతనంతోనే తనను గుర్తించవద్దని, తను మనసా చేసిన ఆర్తనాదాలు సౌజన్య గుండెల్లో అలజడి రేపాయి.

కీర్తి మీద తనకు ఎందుకు కోపం వచ్చిందో స్పష్టంగా అర్థం అయింది సౌజన్యకు.

చల్లని చినుకు సౌజన్య బుగ్గ మీద రాలింది.

యుగయుగాల అణచివేత స్పృహతో, తనను తాను మానవిగా తీర్చిదిద్దుకొనేందుకు, తను, తనవంటి ఎందరో స్త్రీల ప్రయత్నాలు, విజయాలు, అపజయాల పరంపరలో, కీర్తి రచయిత్రిగా రంగ ప్రవేశం చేసి తనకు శత్రువైంది.

ప్రేమ, దయ, అనుభవం, అనుభూతి మొదలైన మానవజీవన సంబంధాలన్నింటినీ తిరస్కరిస్తూ తమ చుట్టు తాము కట్టుకునే దుర్భేద్యమైన గోడల మధ్య చీలిక తెస్తున్నా పూర్తిగా 'కీర్తి'ని అర్థం చేసుకున్నారు తామంతా. కానీ ఆ అమాయకురాలిని అడ్డం పెట్టుకొని మొత్తం గోడలు కూలదోయించే మగవాళ్లమందలో...." సౌజన్యకు నవ్వొచ్చింది.

గబగబా నాలుగు చినుకులు రాలాయి. నల్లని మబ్బుల మధ్య తళుక్కున ఓ తటిల్లత. ఆకాశమధ్యంలో వెలుగుపూల మాలిక. అక్కడో సింహాసనంలో కీర్తి గర్వంతో కూర్చుని విరగబడి నవ్వుతున్నట్లే అనిపించింది.

"ఇంకో వికెట్ పడింది నర్మదా...."ఎంత గర్వంతో, ఎంత



తిరస్కారంతో చెప్పివుంటుందో పాపం.

మనుషుల్లో కొందరికి స్నేహం కనిపిస్తుంది. కొందరికి కేవలం శరీరం కనిపిస్తుంది. సంస్కారాల్లో ఎంత బేధం! ఇంకో మెరుపు ఈసారి కీర్తి చదువుల తల్లి లాగా కనిపించింది. జనరల్ మేనేజర్‌గా ఒక కార్పొరేట్ కంపెనీలో పనిచేసే కీర్తి ఇంకోలా ఎలా ఉంటుందీ? అది శక్తి... అది తుఫాన్. అది మెరిసే విద్యుల్లత! కనుక.. ఈ శర్మ, మీనన్, చివరికీ ఈ అశోక్ కూడా ఆవిడను చూసి మతులు పోగొట్టుకోనీ...ఆవిడకేం నష్టం!

"వర్షంలో తడుస్తావురా నాన్నా... ఇల్లారా ఎత్తుకుంటా"

సౌజన్య పక్కనుంచి నడుస్తున్న ఓ పాతికేళ్ళ తల్లి, వాళ్ళ అబ్బాయిని రెండు చేతులా కౌగిలించుకొని, జాగ్రత్తగా ఎత్తుకొని భుజానికి ఆనించుకొంది. చిన్నగా సున్నితంగా ఆ బాబు బుగ్గని ముద్దాడింది. 'తల్లి' అన్న పదంలో ఎంత మాధుర్యం. భావజాలం వద్దనుకొంటూనే ఆ మాతృమూర్తి గుండెల్లోంచి ఉప్పొంగిన ప్రేమతో ఆ బాబుతోపాటు తను తడిసిపోయాననుకొంది సౌజన్య.

"ఆ జోలె ఇలగియ్యి నీ దుంప తెగ...కాళ్ళకి అది అడ్డం పడి చస్తావు. నేనేం నీ ముల్లె తింటానా ఏందీ? మనిషిని నమ్మి సావలేప్. ఇరవై ఏళ్ళ కాడినుంచి నాముద్ద తింటున్న విశ్వాసం లేదు. గుడ్డినంజకొడుక్కి. ఎంత అపనమ్మకవో ఎదవకి...'

ఓ అవ్వ విసుక్కుంటూ గుడ్డి ముసలాడ్ని గబగబా చెట్టు కిందికి లాక్కుపోతోంది. ముసలాడుపడుతూ లేస్తూ నడుస్తున్నాడు కానీ బరువుగా వున్న జోలె మటుకు ముసలిదాని చేతికి ఇవ్వనే లేదు...

వర్షం జోరు పెరుగుతోంది...

'ఫోన్లెండి రిక్షా ఎక్కేద్దాం. రూపాయి దగ్గర ఎంతసేపు బేరం. మళ్ళీ తడిసిపోతే రాత్రంతా ఊపిరాడక అవస్థ పడతారు..." అంటోందో ఇల్లాలు వర్షంలో తడవకుండా భుజాన వున్న కొడుక్కి కొంగు కప్పేసి, రిక్షా అతనితో బేరం ఆడుతున్న భర్తతో.

సౌజన్య మొహం వికసించింది. అబ్బ ఏం ఆడవాళ్ళు. వీళ్ల శరీరం హృదయం మొత్తం ప్రేమతోనే తయారయిందా ఏం...?"

ఈ మాట పైకి అంటే అశోక్ తగువుకు దిగుతాడు.

"టోటల్‌గా మనుషుల్లో మంచి,చెడూ ఉంటాయట. చెడ్డతనం కొందరికి పరిమితం కాదట. చెడ్డఆడవాళ్లు, మంచి ఆడవాళ్ళు, చెడ్డ మగవాళ్లు, మంచి మగవాళ్ళు జనంలో ఉంటార"ని థియరీ చెపుతాడు.

సరే ఒప్పుకుందాం- ఎక్కడో కొంత మంది మంచి మొగాళ్ళూ వుంటారు...

వర్షం పెద్దదయింది. చల్లగా మొహాన్ని, భుజాలనీ, తలనీ తడుపుతూ వర్షం... సౌజన్య మొహం పైకెత్తి చూసింది. మెరుపుల మధ్య నల్లని ఆకాశం ఉత్సాహంతో కురుస్తోంది.

'గబగబా నడు అశోక్. వేడిగా తాగేందుకు ఏదైనా ఇస్తాను...పూర్తిగా తడిసిపోయావబ్బా....'అంది అభిమానంగా.

అశోక్ ఆమె వంక చూశాడు. ఆమె తడిసిపోతూనే ఉంది.

అతని కళ్ళల్లో ఎందుకో నీళ్ళొచ్చాయి.